"రాజుకి గృహసంప్రదా
యాలూ, అభిమానాలూ అనే
కూకటివేళ్లు లోతుగా మన
సులో నాటుకునే వున్నాయి."

# కూకటి వేరు

ఇంటి వెనుకగా ఉన్న కొద్దిపాటి నేలలో కూరగాయలు పండించి దేశం ఎదుర్కొంటున్న ఆహారపు కొరతను కొంత వరకైనా తగ్గించాలని అనసూయా నేను నిశ్చయించుకొన్నాము. ఉడుకు రక్తం, కొత్త కాపురం, జీవితంలో ప్రతిక్షణాన్ని ఆశయసిద్ధికోసం ఉపయోగించుకోవాలనీ, అందంగా,-ఆదర్శవంతంగా బ్రతుకుల్ని మలచుకోవాలనీ, మహా ఉబలాటంగా ఉన్న రోజులు అవి.

చిన్న బొరిగ, బోపుల గరిట పట్టుకొని ఇద్దరం నేలతవ్వడం మొదలుపెట్టాము. ఆ స్థలమంతా తమదే అన్నట్లు పెరిగి ఉన్న పచ్చగడ్డి, పిచ్చిమొక్కలూ మా ఆయుధాలకి ఎదురు తిరిగి యుద్ధం చేస్తున్నాయి.

ఒక చిన్న గడ్డిమొక్క.... దబ్బనం అంత లావైన మొదలూ, పాలిపోయి ముడుచుకుపోయిన ఆకులూ, ఆకుల చివర పెసరగింజ లంతేసి రెండు కాయలూ, వాటి మధ్య ఒకటీ – అరా బూడిద రంగుల్ని సెనగబద్దలంతేసి పువ్వులూ, అదీ ఆ అంగుళం నేలలో నాకు ఎదురు నిల్చిన ప్రత్యర్థి. మహా బలవంతుడైన మల్లయుద్ధ ప్రవీణుడు పాలుగారు బుగ్గలతోవున్న ఒక అర్భక బాలునితో తలపడేముందు చూసే చూపులా ఒక్కసారి నిర్లక్ష్యంగా అటు దృష్టిని తిప్పి వేళ్ళ కొనలతో పట్టి ఆ మొక్కలని లాగబోయాను. అది గర్వంగా ఒక నవ్వు నవ్వి చలనం లేకుండా నిలిచిపోయింది. చేతికి మరి కాస్త బలం అందించి ఆ మొక్క మొదలు దగ్గర పిడికిలితో గట్టిగా పట్టుకొని ఊడబెరకబోయాను. ఊహూఁ – అది కొంచమైనా కదలి రాలేదు.

ఆశ్చర్యంగా ఆ మొక్కవంక చూశాను... సన్నగా పుల్లలా వున్న మొదలు.... పాలిపోయిన ఆకులు... ఆ మొక్కని చూస్తే దాని వేళ్లు అంత లోతుకి పోయి ఉంటాయని ఎవరూ అనుకోరు. పట్టి చూసేవరకూ నేను అనుకోలేదు.

ఒక్కొక్కసారి మన అంచనాలకి యథార్థాలు ఎంతో దూరంగా ఉంటాయి. ఏదో సమయంలో వాటి అస్తిత్వం ముందు మన ఊహలు తలవంచక తప్పదు. బొరిగె చేతిలోకి తీసుకొని ఆ చిన్న మొక్కని ఊడబెరికే ప్రయత్నంలో ఉండగా మూడేళ్ల కిందట జరిగిన ఒక సంఘటన నా మనసులో కదిలింది. చేస్తున్నపనికీ దానికీ ఏమైనా సంబంధం ఉందా అంటే వుంది. లేదు అంటే లేదు.

ఆ జూలై నెలలో పేపర్లో నా నెంబరు చూసుకొని రెండక్షరాల డిగ్రీకి అర్హుణ్ణని మురిసిపోయాను – ముఖంమీద సంతోషచ్ఛాయ ఇంకా పూర్తిగా తొలగిపోకుండానే నాకు సెంట్రల్ సెక్రటేరియట్‌లో ఉద్యోగం అయిందన్న వార్త అందింది. ఆర్డర్లు చేత బట్టుకొని, పెట్టె, పక్క చుట్టూ రైల్లో పెట్టి 'ఢిల్లీ చలో' అంటూ బయలుదేరాను.

నాలుగేళ్ల క్రిందట పద్మావతి అత్త కూతురు పెళ్లికి వెళ్లి ఉండడం చేత ఊరు మరీ అంత కొత్తగా అనిపించకపోయినా అడుగడుగునా ఎదురయ్యే భాషా సమస్యతో కాస్త తికమక పడక తప్పలేదు. హోటలు గదిలో సామాన్లుపెట్టి స్నానం ముగించి పద్మావతి అత్తగారింటికి బయలుదేరాను.

ఆ రోజు ఆదివారం మూలాన అంతా ఇంట్లోనే ఉన్నారు. 'ఇదిగో శంకరం బావొచ్చాడు' అంటూ అత్తకొడుకు లందరిలోకి చిన్నవాడైన గోపి కేకపెట్టాడు.

"ఎప్పుడు రావడం? ఏమిటి సంగతి? ఉద్యోగం అయిందటగా? జీతం ఎంత? అంతా కులాసా?" వంటి ప్రశ్నలయ్యేక "అమ్మని తీసుకురాలేదా?" అంటూ ప్రశ్నించింది అత్త.

అమ్మకి, పద్మావతి అత్తకి మధ్య బంధుత్వం కన్న స్నేహంపాలు ఎక్కువ. అత్త ఎప్పుడు ఆంధ్ర వచ్చినా మా ఇంట రెండు, మూడు రోజులు ఉండకుండా వెళ్లిపోదు.

"అక్కయ్యకి పురిటి రోజులు, పురుడు తీరి దాన్ని అత్తవారింటికి పంపితే కానీ అమ్మ రాదు" అన్నాను.

"మరి ఎక్కడ దిగావు? ఏం చెయ్యాలనుకొంటున్నావు?" సిగరెట్ పొగ గాలిలోకి వదుల్తూ ప్రశ్నించాడు మామయ్య.

"ఈ రెండు మూడు నెలలూ హోటల్లో ఉంటే సరిపోతుందనుకొంటున్నాను. ఇల్లు దొరికినా వంటా, వార్పూ బాదర నేను పడలేను" అన్నాను.

"ఊళ్లో మేముండగా హోటలు ఖర్మేం? ఇక్కడికి వచ్చాయి" అంది అత్త.

"ఒక రోజా, రెండు రోజులా ఎందుకు శ్రమ?" అన్నాను.

నిజానికి మా ఊర్లో బయలుదేరే ముందే ఈ పరిస్థితి గురించి నేనూ అమ్మా చర్చించుకున్నాం. వాళ్లు మరీ అంటే ఉండననడం బాగుండదు అంది అమ్మ.

"శ్రమ కేముంది? నీ కోసం ప్రత్యేకం ఏం చెయ్యాలి? మరింకేం మాట్లాడక సామాన్లు తెచ్చుకొచ్చేయి" అంది అత్త.

"ఒరేయి రమణా, బావతో నువ్వెళ్లి అవన్నీ పట్టించుకురా" అంటూ ఆర్డరు జారీ చేశాడు మామయ్య.

రమణ వారి రెండో కొడుకు. నా కన్నా రెండేళ్లు చిన్నవాడు పెద్దవాడు రాజూ. నేనూ ఒక ఈడువారం. వాడి కోసం ఇటు అటూ చూస్తూ 'రాజేడీ' అని ప్రశ్నించాను.

"స్నానం చేస్తున్నాడేమో" అంది అత్త.

నేను మేడ దిగి కిందికి వచ్చేసరికి రాజు ఎదురుపడ్డాడు.

"ఎప్పుడు రావడం?" అన్నాడు.

"ఇప్పుడే" అంటూ సంగతి సందర్భాలు చెప్పాను.

"సరే ముందు పోయి సామాన్లు తెచ్చుకురా... తాపీగా మాట్లాడుకొందాం" అన్నాడు.

రాజు చిన్నప్పుడు వాళ్ల నాన్నగారి బదిలీల మూలంగా మా ఇంట్లో కొంత కాలం ఉండి చదువుకొన్నాడు. అందుకే ఆ ఇంట్లో మిగిలినవారితోకన్నా రాజుతో నాకు కాస్త చనువు జాస్తి.

నేను ఆ ఇంటికి వచ్చిన వారం రోజులనాడనుకొంటాను. రాజు, నేనూ డాబా చివర నిల్చి చిన్ననాటి కబుర్లేవో చెప్పుకొంటున్నాం. క్రిందనున్న లాన్‌లో ఒక అమ్మాయి ఒడిలో ట్రాన్‌సిస్టర్ పెట్టుకొని క్రికెట్ కామెంట్రి వింటున్నది.

"హల్లో గుడియా స్కోరెంత?" అంటూ రాజు ఆ పిల్లని ప్రశ్నించాడు. ముఖమెత్తి పైకి చూస్తూ ఆ పిల్ల హిందీలో జవాబు చెప్పింది. ఆ పిల్ల ముఖం చూస్తుంటే అంతకు పూర్వం ఎక్కడో చూసినట్లే అనిపించింది. "ఎవరేమిటి?" అన్నాను రాజువంక తిరిగి. "ఇంటి వారి అమ్మాయి - చాల మంచి పిల్ల" అన్నాడు రాజు ఉత్సాహంగా. "పేరేమిటన్నావు?" వెనుతిరిగి వెళ్లిపోతున్న ఆ పిల్లవంక చూస్తూ ప్రశ్నించాను.

"గుడియా.... అసలు పేరు ఇంకేదో ఉంది. కాని ఇంట్లో అంతా అలాగే పిలుస్తారు" అన్నాడు రాజు.

ఆ పిల రెండు జడలు, మెడమీదుగా ఉన్న చున్నీ చూశాక జ్ఞాపకం వచ్చింది. నేను హోటల్‌కి పోయి సామాన్లు తెచ్చుకోవాలని బయలుదేరిన సమయంలో రాజూ, ఆ పిల్లా ఎదురుపడ్డారు. రాజు నన్ను పల్కరిస్తుంటే ఆ పిల్ల ఇంట్లోకి వెళ్లిపోయింది.

రాజు అన్నట్లు గుడియా చాల మంచి పిల్ల. చక్కనిది. తెలివైనది. తమాషాగా మాట్లాడుతుంది. గుడియా తండ్రి డాక్టరు. తల్లి కాలేజీ లెక్చరర్. చిన్న తమ్ములు ఇద్దరూ బోర్డింగు స్కూల్లో చదువుకొంటున్నారు. వారింటి గుమ్మాలకి, కిటికీలకి కదలాడే తెరలు, వారి డ్రాయింగు రూమ్‌లో టేబిలుమీద ఉండే పత్రికలు వారి సంస్కృతికి, నవనాగరికతకు చిహ్నాలుగా ఉంటాయి.

పద్మావతి అత్తగారి వాటా కూడా రమారమి కిందవున్నంతా వుంది. కాని దాన్ని ఉపయోగించుకోడంలో, అలంకరణలో ఎంతో తేడా కనిపిస్తుంది. "మన వైపు ఎంతెంత ఇళ్లున్నా అందం చందం లేకుండా ఉంచుకొంటారు. వీరిని చూచి మనవాళ్లు నేర్చుకోవలసింది చాలా వుంది" అన్నాను ఏదో మాటల సందర్భంలో.

అత్తయ్యకి ఇంటిగల వాళ్ల మీదగల అక్కసు వెళ్లబోసుకోడానికి అవకాశం దొరికింది.

"మనం ఉండేందుకు ఇల్లు కట్టుకొంటాం. వీళ్లు పూజించేందుకు కట్టుకుంటారు. మా ఇంటివాళ్ల సంగతే చూడు... ఆయనేమో రాత్రీ పగలూ ఆస్పత్రిలో ఉంటాడు. ఆవిడ

ఉదయం తొమ్మిది గంటలకి పోతే సినిమాలు, షికార్లు చిత్తగించి ఏ రాత్రికో ఇల్లు చేరుతుంది. ఇంక మిగిలింది ఆ పిల్ల. కాలుమోపితే గచ్చులు మాసిపోతాయి. అన్నట్లు నడుస్తుంది. మరి తుడిచిన గుమ్మాలు తుడిచినట్లు, పెట్టిన వస్తువులు పెట్టినట్లు ఉండక ఏం చేస్తాయి? ఇంటికి వచ్చిన తరువాత అయినా ఆ మొక్కలమధ్యా, ఈ పచ్చగడ్డి మీదా అఘోరిస్తారేకాని అందంగా నలుగురూ హాలులో కూర్చోగానే నెప్పుడూ చూడలేదు.

"... మా యింటి సంగతే చూడు.... మీ మామయ్యేమో....!" అని అత్త మొదలు పెట్టబోయేసరికి నా అదృష్టం కొద్దీ కుంపటిమీద పాలు పొంగుకొచ్చాయి. లేకుంటే ఆ రోజు ఆఫీసుకి అరగంట ఆలస్యంగా వెళ్లవలసి వచ్చేది.

అటు తరువాత జరిగిన సంభాషణల్లో కూడా అత్తయ్యకి ఆ ఇంట్లో మనుషుల మీద ఏపాటి సద్భావం లేదని తెలుసుకొన్నాను. గుడియాతో రాజుకున్నంత స్నేహం నా కేర్పడకపోయినా ఆమె గురించి అత్తయ్య వెలితిగా మాట్లాడితే నా మనసుకి కష్టంగా వుండేది. ఆ పిల్లలో అత్త ఎత్తి చూసే లోపాలు ఏమీ నాకు కన్పించకపోవడమే అందుకు కారణమనుకొంటాను.

నెలరోజులు వారింట గడిపేసరికి నాకు అక్కడి వాతావరణం అర్థమయింది. అత్తయ్యకి ఆ పిల్లపట్ల ఎంత చులకన భావం ఉందో రాజుకి అంత మంచి అభిప్రాయం ఉంది. మామయ్య పూర్తిగా క్రియావాది. చెయ్యాలనుకున్నది చేసేడమే కాని నోటితో మాట తొణకదు. అతడి మనసులో ఏముందో ఆ బ్రహ్మదేవుడికే తెలియాలి.

గుడియాపట్ల రమణ భావాలు మాత్రం తమాషాగా ఉండేవి. అన్నతో ఉన్నంత చనువుగా ఆ పిల్ల తనతో ఉండదని బాధపడుతూనే.... ఆ పిల్ల కలివి తనాన్ని ఆక్షేపించేవాడు. 'మరీ ఉత్తరాది పిల్లలకి అడ్డూ.... ఆపూ ఉండదు. అయిందానికీ కాని దానికీ వెంటపడి తిరుగుతారు... గుడియా సంగతే చూడు.... రాజుతో నువ్వయినా చెప్పు. చూసిన నలుగురూ నవ్వుతున్నారని అంటూ వారి స్నేహం మీద కామెంటు చేసేవాడు.

కాలం గడుస్తుంటే రాజుకి, ఆ పిల్లకి మధ్య స్నేహంకన్న మిన్నయైన అనుబంధం ఇంకేదో ఉన్నదనిపించింది నాకు. దాని గురించి ఆలోచించి అట్టే సమయం వ్యర్థపుచ్చనక్కరలేకుండానే అసలు రంగు బయటపడింది.

ఏదో ఆఫీసు పనిమీద ఛండీఘర్ వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి అత్తయ్యా వాళ్లు సినీమాకి వెళ్లారు. గుడియా, రాజు లాన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నేను తిన్నగా మేడమీదికిపోయి నా గదిలో లైటు వేసుకొని ఏదో పుస్తకం చేతిలోకి తీసుకొన్నాను. కాని అక్షరాలకి మధ్యగా రాజు, ఆ అమ్మాయి నవ్వుతూ, తుళ్లుతూ కన్పించడంతో చదువు సాగలేదు. అరగంట గడిచాక రాజు మేడ మీదికి వచ్చాడు.

"ఎలా వచ్చావు? ఎప్పుడు వచ్చావు?' అన్నాడు తడబడుతూ.

రాజు తడబాటుకి కారణం లేకపోలేదు. గేటు తెరచుకొని ఎవరు వచ్చినా లాన్‌లో ఉన్నవారి దృష్టిలో పడకుండా మేడమీదికి రావడం జరగదు. నేను వారి కళ్లపడకుండా రాగలిగానంటే మాటల్లో వారెంతగా లీనమయిపోయారో తెలియచేస్తుంది.

"ఇప్పుడే ఇలా వస్తున్నా" అన్నాను.

రాజుకి నా మాట మీద నమ్మకం కుదరలేదు. అప్పటికే నేను బట్టలు మార్చుకొని పుస్తకం చదువుకొంటున్నాను. ఏష్ట్రేలో కాల్చి పారేసిన రెండు, మూడు సిగరెట్ పీకలున్నాయి.

"ఏదో రోజున నీతో చెప్పాలనే అనుకొంటున్నాను. శంకరం" అంటూ రాజు మొదలుపెట్టాడు. అంతా విన్నాక 'అదృష్టవంతుడివిరా' అని రాజు భుజంమీద చరచడం మినహా నేను మరేం అనలేకపోయాను.

నా దగ్గర దాచవలసిన అవసరం తప్పాక వారిద్దర్నీ చాలాసార్లు జంటగా బజార్లోనూ, సినిమాలోనూ చూడడం జరిగింది. కొన్నిసార్లు నన్ను చూసి నవ్వుతూ చెయ్యి వూపి దాటిపోయేవారు. ఎప్పుడైనా తమతో రమ్మని తీసుకుపోయేవారు.

రాజు అసలు విషయం చెప్పాక ఆ పిల్లపట్ల నా మనసులో అదివరకు ఏమైనా భావాలుంటే అవన్నీ సమసిపోయాయనే చెప్పవచ్చు. గుడియా రాజుకి కాబోయే వధువుగా మాత్రమే నా దృష్టిలో నిలిచిపోయింది. ఆ జంటని చూస్తూంటే నాకెంతో ముచ్చట వేసేది. కాని ఆ ఆనందానికి వెనకగా ఏదో అజ్ఞాత భయం మాత్రం తారట్లాడుతుండేది.

ఎమ్మెస్సీ పాసైన రాజు ఒక వంక ఉద్యోగాలకీ, వేరొక వంక విదేశాలలో రిసర్చి అవకాశాలకీ చాలా పట్టుగా ప్రయత్నాలు చేసాడు. ఆ సమయంలోనే ఏదో ఉద్యోగానికి కాన్పూరు ఇంటర్వ్యూకి కార్డు వచ్చింది. వాడిని రైలు ఎక్కించి రావాలని నేను కూడా బయలుదేరాను. మే మిద్దరం స్టేషను చేరుకొనేసరికి గుడియా అక్కడే వుంది. రాజు ఆమెని పలకరిస్తూ ఏమో అన్నాడు. రాజు మాట, గుడియా జవాబు అప్పుడే బయలుదేరుతున్న ఏదో రైలుకూతలో కలిసిపోయాయి.

"మీరుకూడా ఎక్కడికైనా ఊరుకి పోతున్నారా?" అని ప్రశ్నించాను. రాజు, గడియా ఆ ఏర్పాటు ముందుగా చేసుకొని, కలసి కాన్పూరు వెళ్తున్నారేమో అని నా కెందుకో అనుమానం కలిగింది. వారిద్దరూ న్యూఢిల్లీ నగర వీధుల్లో, సినీమాల్లో జంటగా తిరిగేందుకు అడ్డంకి చెప్పని నా మనసు, కలసి కాన్పూరు వెళ్తారన్న ఆలోచనతో ఎందుకో కంగారుపడింది. బహుశా దానికి కారణం, వారి చర్యకి అత్త ముందు నేను సంజాయిషీ చెప్పవలసి వస్తుందన్న భయంవల్ల అయి వుంటుంది.

"ఎవరో చుట్టాలు వెళ్తుంటే వారికి అంపకం పెట్టాలని వచ్చాను" గుడియా సమాధానం చెప్పింది భారం తీరి నేను విడిచిన నిట్టూర్పు ఇంజను వదిలిన ఆవిరి చప్పుడులో కలిసిపోయింది.

రాజుని రైలెక్కించి బయటికి వచ్చేసరికి టాక్సీల కోసం, బస్సుల కోసం జనం పరుగులు పెడుతున్నారు. మా కోసమే వచ్చి నిల్చినట్లు ఒక ఆటోరిక్షా అక్కడ వచ్చి ఆగింది. ఇద్దరం ఒకే ఇంటికి వెళ్లవలసిన వాళ్లం. ఆ వేళప్పుడు ఆమెని ఒంటరిగా పంపినా. నా మానాన నేను వెళ్లిపోయినా బాగుండదనిపించింది.

కాస్త జంకుతూనే "రండి... మనకోసమే దేవుడు పంపినట్లు వచ్చి ఆగింది. లేకపోతే ఈ దొమ్మిలో మనకి వాహనం అందేసరికి అరగంటకి పైగా పట్టి వుండును" అన్నాను.

గుడియా ఎటువంటి సంకోచం లేకుండా ఎక్కి నా పక్కన కూర్చుంది. ఇంటికి చేరాక నేను వాడికి డబ్బు ఇవ్వబోతూంటే.... "నా భాగం నన్ను ఇవ్వనీండి" అంది పర్సులోంచి డబ్బులు తీస్తూ.

"ఫరవాలేదు ఉంచండి" అన్నాను.

ఆపిల్ల నా మాట వినిపించుకోకుండా వాడి చేతిలో డబ్బులు పెట్టి "థాంక్సండీ" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

ఎందుకో నా మనసు క్షణకాలం విలవిల్లాడింది. రాజు ఎన్నోసార్లు ఆ పిల్లకోసం ఏదో కొనిపెట్టగా, టాక్సీల మీద సినిమాలకి, బజార్లకీ తిప్పగా చూశాను. ఆమె ఏనాడూ మాట వరసకైనా డబ్బు ఇస్తాననడం నా కంట పడలేదు. "నీ స్నేహం విలువ ఇంతే" అని ముఖాన కొట్టినట్లు వాడి చేతిలో డబ్బులు పెట్టి వెళ్లిపోయింది. ఆటోరిక్షా నడుపుతున్న సిక్కు యువకుడు నా వైపు చూసి హేళనగా నవ్వినట్లు అనిపించింది. ఆడపిల్లల్ని వలలో వేసుకోడం అంత సులువుకాదురా అబ్బాయి అన్నట్లు నావంక చూసి వాడు వెళ్లిపోయాడు.

విసురుగా మేడ మెట్లు ఎక్కి పైకి వచ్చాను. ఎదురుగా వరండాలో ఉన్న అత్తంత మనిషినే చూడకుండా లోపలికి అడుగు పెట్టబోయానంటే అప్పటి నా పరిస్థితి వేరుగా వివరించవలసిన అవసరం లేదనుకొంటాను.

"ఇద్దరూ కలిసే వచ్చారా?" సూటిగా చూస్తూ ప్రశ్నించింది అత్త. లేదని అబద్ధం చెప్పి వాదించే ఓపిక లేక "అవు"నన్నాను.

"ఇంక వాడి నొదిలి నిన్ను పట్టుకుందేమిటి?"

తన కూతురులాంటి ఇంకొక ఆడపిల్లను దెయ్యమో... దేవతో అయినట్లు పట్టుకుందా అని అత్త అడగడం నాకు నిజానికి కొంచెం కష్టం కలిగించింది.

"ఇంత కాలంగా ఢిల్లీలో వుంటున్నా నీ చాదస్తం అణుమాత్రమైనా తగ్గలేదు అత్తయ్యా" అన్నాను నేను నవ్వుతూ.

"అసలు విషయం తెలిస్తే నువ్విలా అడగవురా" అంది అత్తయ్య నొచ్చుకొంటూ. ఆ చీకటిలో ఆమెకు కళ్లనీళ్ల పర్యంతం అయిందని తెలుసుకున్నాను.

"మరోలా అనుకోకు అత్తా. నవ్వుతాలకి అన్నాను. రాజుని రైలు ఎక్కించి వస్తుంటే ఈపిల్ల కన్పించింది. ఎవరో బంధువుల్ని అంపకం పెట్టాలని వచ్చిందట. ఇద్దరం ఒక ఇంటికేకదా... ఖర్చు కలసి వస్తుందని ఒక ఆటోరిక్షా చూసుకొని వచ్చాం.... అంతకన్న మరేం లేదు" అన్నాను. నేను 'ఖర్చు కలసి వస్తుంది' అన్న మాటని కావాలనే జోడించాను. దానివల్ల నేను కోరిన ఫలితం కూడా అందుకొన్నాను.

"ఏదో మీ అమ్మ అంత కష్టపడి చదివించింది. బుద్ధిగా మసలుకొని నాలుగురాళ్లు వెనకేసుకో.... ఆ వెనక పెళ్లయి పిల్లా పాపా పుట్టుకొస్తే అవసరానికి పనికివస్తుంది" అంటూ హితోపదేశం మొదలుపెట్టింది. అసలు విషయం పక్కకి తొలగిపోయింది.

రాజుకి ఆ ఉద్యోగం రాలేదు. కాని నెల తిరగకుండా జర్మనీలో రీసెర్చి స్కాలర్‌షిప్ వచ్చింది. ఇంట్లో అంతా ఒకటే హడావిడి. అత్తయ్య ఆనందానికి ఇంక అవధులు లేవు. కూతురు పెళ్లికి చేసినంత హంగామా చేసింది.

విదేశాలకి పోతున్న తమ్ముణ్ణి చూడ్డానికి పతీ, సుత సమేతంగా అత్తింటి నుంచి పద్మజ వచ్చింది.

"నువ్వట్రా శంకరం! నా పెళ్లినాటికి ఇంతుండేవాడివి. బాగా పొడుగు ఎదిగిపోయావు" అంటూ పలకరించింది.

ఈ ఆప్యాయాలు, ఆర్భాటాల మధ్య వారం పదిరోజులు రాజు ఆ నాలుగు గోడల మధ్య బందీ అయిపోయాడు. ఆ రోజుల్లో గుడియాని కలుసుకొని పట్టుమని పది నిమిషాలు మాట్లాడే అవకాశం కూడా వాడికి ఉండేదికాదు. మేడపైన యింత హడావుడి జరుగుతూంటే దానికి కారణమైన వ్యక్తితో సంబంధం వున్నా అందులో భాగం పంచుకోలేని గుడియా ఏవో పేపర్లు, పత్రికలు తిరగవేస్తూ ఒంటరిగా కింద హాల్లో కూర్చునేది.

ప్లేను రిజర్వేషన్లలో వచ్చిన మార్పు మూలంగా రాజు ప్రయాణం అనుకొన్నదానికన్న నాలుగు రోజులు ముందుకి జరిగింది. ఆ సాయంకాలం అత్తయ్య ఆజ్ఞమీద అర్జంటుగా బజారుకిపోయి ఏవో వస్తువులు తెస్తుంటే గుడియా ఎదురుపడింది.

"రేపే రాజు ప్రయాణం" అన్నాను, ఆ పిల్ల ముఖంలో కదలాడబోయే రంగుల్ని ఊహించుకొంటూ.

"అవును రాజు ఇప్పుడే చెప్పి వెళ్లాడు" అంది.

ఆ పిల్ల మనసులో ఏముందో కాని.... నేను ఊహించినట్లు బయటికి మాత్రం తేలలేదు. నిర్లిప్తంగా ఆమె ఇచ్చిన సమాధానం నా కెందువల్లో నిరుత్సాహం కలిగించింది. బహుశా ఆ పిల్ల కళ్ళ నీళ్లు పెట్టుకుంటే ఓదార్చాలనీ, ధైర్యం చెప్పి ఆమె నమ్మకాన్ని సంపాదించాలనీ నా మనసులో ఏ మూలో వుండి వుంటుంది. తీరా దానికి అవకాశం ఆ పిల్ల కలిగించకపోయేసరికి నా ఉత్సాహం నీరు కారిపోయింది.

రాజు ప్రయాణం రోజున మామయ్య ఎవరో స్నేహితుల దగ్గరినుంచి రెండుకార్లు పట్టుకొచ్చాడు. పెళ్లికి తరలివెళ్లే మగపెళ్లి వారిలా ఇంటిలో వున్న వారందరం ఏరోడ్రొముకి బయలుదేరాం. నేను రాజుయొక్క సామాన్లు కారులో సర్దిస్తుంటే అత్తయ్య ఇంటి తాళాలు వేసి వచ్చింది.

ఆ ఉదయాని కల్లా దొరికిన ఆ రెండు నిమిషాల్ని రాజు ఉపయోగించుకొన్నాడు.

"ఉత్తరాలు రాస్తుంటాను గుడియా... రెండు మూడేళ్లు ఎంతలో గడిచిపోతాయి" అన్నాడు ఆ పిల్ల చెయ్యి పట్టుకుంటూ.

గుడియా అంతకన్నా బలమైన ఇంకేదోమాట కోసం ఎదురు చూసి వుంటుంది. ఇంతేనా అన్నట్లు పేలవంగా నవ్వి ఊరుకొంది. రాజు చేతినుండి విడివడిన ఆమె చెయ్యి నెమ్మదిగా పక్కకి జారిపోయింది.

"క్షేమంగా వెళ్లిరా రాజా" అంది నెమ్మదిగా.

అత్తయ్య అటు ఇటు కంగారుగా చూస్తూ "రాజేడీ... ఇప్పటికే ఆలస్యం అయిపోయింది" అంటూ ఎదురుగా వున్న హాలులో బొమ్మలా నిలబడి వున్న పిల్లవేపు అక్కసుగా చూసింది.

"ఇక్కడ వున్నానమ్మా" రెండో కార్లోంచి రాజు జవాబు చెప్పాడు.

కారు గేటుదాటి వెళ్లిపోతూంటే రాజు వెనుతిరిగి చూడటం నేను గమనించాను. కాని ముందు హాలులోంచి అరంగుళమైనా కదలిరాని గుడియా వాడిచూపు అందుకోగలిగి ఉంటుందని నేను అనుకోను. రాఉ వెళ్లిపోయాక అత్తకి వెంటనే తిరిగి ఇంటికి రావాలనిపించలేదు. మేటనీ సినిమా చూసి ఇంటికి వచ్చేసరికి కను చీకటి పడుతున్నది. గేటులోంచి కార్లు ముందుకి వస్తుంటే ఆ పిల్ల ఉదయం మేము వెళ్లేముందు ఉన్న స్థానంలో అలాగే వుంది. ఇంత సేపు అదే స్థలంలో అలా నిలబడి వుండడం అసంభవం. బహుశా కార్ల శబ్దం విని వచ్చి వుండవచ్చు. కాని నాకు మాత్రం ఈ ఆరు గంటల కాలం గుడియా బొమ్మలా అక్కడే నిల్చి వున్నట్లు అన్పించింది.

మిసెస్ ధన్‌పాల్ ఏదో మీటింగు ఉందని నాలుగు రోజుల క్రిందటే ఊరికి వెళ్లింది. డాక్టరు ధనపాల్ ఏ కేసుల్లో మునిగి తేలుతున్నాడో, రాత్రి తొమ్మిది వరకూ, ఆ పిల్ల ఒంటరిగా లాన్‌లో కూర్చుని ఆకాశంవంక చూస్తూండడం నా గదిలోంచి స్పష్టంగా కన్పించింది.

కిందికిపోయి ఆ పిల్లని ఓదార్చాలనిపించింది. కాని ఏ మాట చెప్పినా ఆమెని బాధపెట్టినట్లు అవుతుందేమో అని ఊరుకున్నాను.

వారం నాడు రాజు దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. "స్వదేశాన్ని వదలి రావడం అంటే ఏమిటో ఇప్పుడు తెలుస్తున్నాదిరా శంకరం. అది నేననుకొన్నంత సులువుకాదు" అంటూ రాశాడు.

ఆరోజే నేను అనుకొన్నాను. అన్న విధంగా రాజు తిరిగివచ్చినా గుడియాతో వివాహం జరగబోదని, కొంతకాలం స్వదేశాన్ని వదలడమే కష్టం అనుకొంటున్న రాజు ఏ పరిస్థితుల్లోనూ శాశ్వతంగా స్వజనుల్ని వదులుకోలేడనీ–

అనుకొన్న విధంగా మూడేళ్లు గడిచిపోయాయి. రాజు తిరిగి వచ్చాడంటూ మామయ్య ఉత్తరం రాస్తూ శుభలేఖ కూడా జతపర్చాడు. దాన్ని చూశాక నా అంచనా తప్పు కాలేదని గర్వపడ్డాను. కాని గుడియాని తల్చుకొంటే ఈనాటికీ నాకు జాలిగానే ఉంటుంది.

పైకి ఏమీ పట్టించుకోనట్లు కన్పిస్తున్నా రాజుకి గృహ సంప్రదాయాలూ, అభిమానాలూ అనే కూకటి వేళ్ళ లోతుగా మనసులో నాటుకునే ఉన్నాయనీ, అవసరం పడినప్పుడు అవి తమ బలాల్ని ఉపయోగించి పట్టి నిల్పుతాయనీ, ఈ విషయాల్ని గుర్తించకపోవడమే గుడియా చేసిన తప్పనీ అనిపించింది నాకు.

ఆమె పుట్టింది ఈ దేశంలోనే అయినా పెరిగింది, పాశ్చాత్య సంప్రదాయ ప్రకారం. అందుకే తెలుసుకోలేకపోయింది. రాజు లాంటి వాడికి తన వారితో ఉండే అనుబంధాలేమిటో, గుడియాని రాజు మోసం చేశాడని కాని... ఆ పిల్ల మోసపోయిందని కాని నేను అనను. ఇద్దరూ జీవితంలో ఒక పాఠం నేర్చుకొన్నారు.... అంతే....

"అయ్యో.... అదేం పనండీ?.... అలా ఉన్న పళంగా లాగుతే అది వస్తుందా? చుట్టూ మన్ను పెళ్లగించి మరీ లాగండి" అంది అనసూయ.

అనసూయ హెచ్చరిక నన్ను వర్తమానంలోకి లాక్కొచ్చింది. "ఇంత పీలగా ఉన్న ఈ మొక్కకి ఎంత లోతుగా వేళ్లున్నాయో చూశావా అనసూయా?" అన్నాను, బలమంతా ఉపయోగించి దానిని పైకిలాగుతూ, మొక్కయితే ఊడివచ్చింది, కాని దానిచుట్టూ ఇంత మట్టిపెళ్ల ఉండనే వుంది.